ఉపాధిహామీ పనులకు రూ.2లక్షల కోట్లు కేటాయించాలి

సీపీఐ జిల్లా కార్యదర్శి చాపర వెంకటరమణ

విశాలాంధ్ర-సోంపేట : రాష్ట్రంలో ఉపాధిహామీ పనులకు రెండు లక్షల కోట్ల రూపాయలు కేటాయించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి చాపర వెంకటరమణ డిమాండ్ చేశారు. ఒక్కో కుటుంబానికి ఏడాదికి 200 రోజుల పనిదినాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కనీస వేతనాన్ని రోజుకు 600 రూపాయలు ఇవ్వాలని పేర్కొన్నారు. కంచిలి మండలం శాసనాం గ్రామంలో గుడ్డిభద్ర వెంకటస్వామి అధ్యక్షతన ఆదివారం భారత కమ్యూనిస్ట్ పార్టీ కంచిలి శాఖ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చాపర వెంకటరమణ మాట్లాడుతూ ఆహారభద్రత చట్టాన్ని పటిష్టపర్చాలని అన్నారు. అలాగే రైతుల భూమి హక్కులకు నష్టం చేసే వైకాపా ప్రభుత్వం తెచ్చిన భూమి యాజమాన్య హక్కుల చట్టాన్ని రద్దు చేయాలని, చుక్కల భూములకు, బంజరు భూములకు అన్నింటికి పట్టాలివ్వాలని కోరారు. రైతు వ్యతిరేక విధానాలను అనుసరిస్తూ రైతాంగ ఆత్మహత్యలకు కారణమైన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలకు నిరసనగా గ్రామాల్లో ప్రచారం నిర్వహించి ప్రభుత్వాలకు బుద్ధి చెప్పాలని విజ్ఞప్తి చేశారు. సాగులో ఉన్న కౌలు రైతులందరికీ ఇన్‌పుట్ సబ్సిడీ వెంటనే చెల్లించాలని, రైతు, కౌలు రైతు ప్రయోజనాలకు అనుగుణంగా సమగ్ర పంటల బీమా పథకాన్ని తీసుకు రావాలని, వాస్తవ సాగుదారులైన కౌలు రైతులకే బీమా పరిహారం చెల్లించే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా కార్యవర్గ సభ్యులు సాలిన నారాయణస్వామి, ఐనింటి లోకనాథం తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లోనూ రాణించాలి : ఎస్పీ రాధిక

విశాలాంధ్ర-మెళియాపుట్టి: విద్యార్థి దశనుండే విద్యార్థులు విద్యార్జనతోపాటు క్రీడల్లోనూ రాణించాలని తద్వారా శారీరిక, మానసిక దృఢత్వంతోపాటు మానసిక ఉల్లాసం పెంపొందుతుందని జిల్లా ఎస్పీ జి.ఆర్ రాధిక అన్నారు. మెళియాపుట్టి, పాతపట్నం, కొత్తూరు తదితర మండల పోలీసు స్టేషన్ల పరిధిలో ప్రతి ఏటా నిర్వహించే కమ్యూనిటీ పోలీసింగ్లో భాగంగా యువతకు వాలీబాల్, క్రికెట్ వంటి ఆటల పోటీలను ఇటీవల నిర్వహించి గెలుపొంది విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు ఆదివారం నాడు మెళియాపుట్టి మండలం చాపర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో జిల్లా ఎస్పీ బహుమతులు అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రీడలతో శారీరక ఉత్సాహంతోపాటు మానసిక ఉల్లాసం ఉత్తేజమవుతుందని తద్వారా అన్నింటా రాణించగలుగుతారన్నారు. టీం స్పిరిట్‌తో కొనసాగినట్లయితే గెలుపు ఓటముల మధ్య తారతమ్య బేధాలు అలవడతాయని, దీంతో యువతకు ఉన్నత శిఖరాలను అధిరోహించే శక్తి వస్తుందన్నారు. అలాగే పోలీసులకు, ప్రజలకు మధ్య సత్సంబంధాలు స్నేహపూర్వకంగా ఉండాలని, సమాజంలో ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలు జరిగినా స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలని, గ్రామాలలో ఎవరైనా ఎక్కడైనా మాదకద్రవ్యాల అమ్మకాలు, ప్రలోభాలకు గురిచేస్తే తక్షణమే కంట్రోల్ రూమ్‌కు సమాచారమందివ్వాలన్నారు. వాలీబాల్, క్రికెట్లలో విజేతలుగా నిలిచిన వారిలో మెళియాపుట్టి మండల నుంచి చాపర, మెళియాపుట్టి రెండవ స్థానాల్లో పెద్దమడి, చాపర గ్రామాలు నిలిచాయి. అలాగే పాతపట్నం నుంచి విజేతలుగా లేజీహర్ట్స్, బిసి హాస్టల్ ద్వితీయ స్థానంలో, ఎస్ఎస్ మునుగు యూత్, పాలెం యూత్‌లు నిలిచారు. కొత్తూరు మండలం నుంచి మహర్తా టీం, నివగాం టీములకు బహుమతులను ప్రదానం చేశారు. అలాగే చాపర, మెళియాపుట్టి గ్రంథాలయాలకు పుస్తకాలు, కమ్యూనిటీ భవనాలకు ప్యూరిఫైడ్ వాటర్ మిషన్లను అందించారు. క్రీడాకారులకు బహుమతుల ప్రధాన కార్యక్రమంలో ఎస్పీ రాధికతోపాటు డీఎస్పీ కె..మహేందర్ రెడ్డి, కొత్తూరు, పాతపట్నం సీఐలు వేణుగోపాల్, నల్లి సాయి, మెళియాపుట్టి, పాతపట్నం, కొత్తూరు ఎస్ఐలు రాజేష్, యాసీన్, నారాయణస్వామి, పోలీస్ సిబ్బంది, వ్యాయామ ఉపాధ్యాయులు, విద్యార్థులు, క్రీడాకారులు, యువత తదితరులున్నారు.

శిథిలావస్థలో బంజేరుపేట పాఠశాల

- బిక్కుబిక్కుమంటూ చదువులు
- తల్లిదండ్రులు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోని అధికారులు
- ఎంఈఓను వివరణ కోరగా నాకేమీ తెలియదంటూ దాటవేత

విశాలాంధ్ర-నందిగాం : మండలం సైలాడ పంచాయతీ బంజేరుపేట గ్రామం పాఠశాల దుస్థితి ఆగమ్యగోచరంగా ఉంది. సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నాం... మెరుగైన విద్య అందించేందుకు కృషి చేస్తున్నామంటూ పాలకులు చెబుతున్న మాటలు ప్రకటనలకే పరిమితమవుతున్నాయి. శిథిలావస్తకు చేరుకుంటున్న బడుల్లోనే చదువుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఉన్నతాధికారులు నిర్లక్ష్యం గ్రామస్తులు పలుమార్లు మండల స్థాయి అధికారులకు విన్నవించుకున్నప్పటికీ ఫలితం లేకుండా పోయిందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. 1994లో నిర్మించిన ఈ భవనం శిథిలావస్థకు చేరడంతో పిల్లలను పాఠశాలకు పంపేందుకు తల్లిదండ్రులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారని, తక్షణం అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ఎస్ఎంసి చైర్మన్ కే సంతోషి, హెచ్ఎంటి రమ్య ఇంతకముందు పలువురు తల్లిదండ్రులు కలిసి ఎంఈఓ నరసింహారెడ్డి సీనియర్ సహాయకుడు డి.నరసింగరావుకు వినతిపత్రం అందించారు. అయినా ఇప్పటివరకు అధికారులలో స్పందన లేదనే గ్రామస్తులు వాపోయారు. పాఠశాలను అభివృద్ధి చేయాలని అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా ఫలితం కనిపించలేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడు ఈ విషయంపై ఎంఈఓతో పలుమార్లు చర్చించగా పైఅధికారులు చూసుకుంటారు, నాకేమీ తెలియదని జవాబు ఇచ్చి దాటిపోయారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక

1980-81ఎన్ టి. ఆర్ పురపాలక సంఘ ఉన్నత పాఠశాల

విశాలాంధ్ర-శ్రీకాకుళం: నాలుగు దశాబ్దాల తరువాత 1980-81ఎన్ టి. ఆర్ పురపాలక సంఘోన్నత పాఠశాలలో విద్య నభ్యశించి వివిధ చదువులు చదువుకొని పలురకాల వృత్తులల్లో నిర్వహిస్తూ ఆదివారం స్థానిక హెూటల్ గ్రాండ్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమానికి వివిధ జిల్లాలో ఉన్న వారు సుమారు 60 మందివరకు పురషులు, మహిళలు కలుసుకొని ఉత్సాహంతో ఒకరికొకరు కలుసుకొని వారు చిన్నతనంలో చేసిన పనులు నెమరు వేసుకొంటూ సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమానికి మండా శ్రీనివాస్, బాల మాన్ సింగ్ కలసి అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో ఈరోజు వివాహదినం సందర్భంగా ప్రసాద్, ఉమాలకు దుశాలువాతో సత్కరించి వివాహదినోత్సవ వేడుకలు నిర్వహించడమే కాకుండా ఇటీవలే అనకాపల్లి జిల్లా దేవరాపల్లిలో అంబేద్కర్ సాంఘిక గురుకుల కళాశాలలో పీజిక్స్ లెక్చరర్ గా విధులు నిర్వహిస్తూ స్వచ్ఛంద పదవీ విరమణ పొందిన కె.వి.ఎల్.ఎన్ రావు సహచర పూర్వ విద్యార్థులు దుశ్శాలువాతో సత్కరించి, అలాగే శ్రీకాకుళం నాగావళి సెల్వెంట్ లో విధులు నిర్వహించి పదవీ విరమణ చేసిన వై కూర్మారావు దంపతులకు దుశాలువాతో ఘనంగా సత్క రించారు. కార్యక్రమంలో మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకులలో మహిళలకు మ్యూజికల్ చైర్స్, లెమన్ అండ్ స్పూన్, బాలాగేమ్ వివిధ పోటీలు నిర్వహించి వారికి బహుమతులు అందజేశారు. ఈ విద్యార్థుల కలయిక కార్యక్రమంలో విశాఖపట్నం నుండి ఎస్.వి.కిషోర్, వి.వి జోగారావు, డి.జి.సి. ఎస్ సీతారామ్, సి.హెచ్. రామలింగేశ్వర రావు, ఎస్.వి.కె విశ్వనాథం, కె వి రమణ, శ్రీకాకుళం లో స్థానికంగా ఉంటున్న బి. రాంమోహన్ రావు, శ్రీను, మధు, దాస్, విశ్వనాథం, సునీతా, పుష్ప లత, ప్రభావతి, భారతీ, సూర్యకుమారి, సుజాత తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీల సమస్యలు పరిష్కరించాలి

విశాలాంధ్ర-మందస : ఆదివాసీల సమస్యలు పరిష్కరించాలని గిరిజన సంఘం అధ్యక్ష, ఉపాధ్యక్షులు సవర గురునాథ్, సవర ధర్మారావులు కోరారు. ఆదివారం గిరిజనుల సమస్యలు పరిష్కరించాలని బంద్ నిర్వహించి అనంతరం ర్యాలీ నిర్వ హించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వం డిఎస్సీ నోటిఫికేషన్‌లో గిరిజనులకు తీవ్ర అన్యాయం చేసిందని, దగా డిఎస్సీ మాకొద్దు, ఆదివాసీ స్పెషల్ డిఎస్సీ కేటాయించాలని కోరారు. జీవో నెం.3ను పునరుద్దరించాలని, ఆదివాసీ మాతృభాష విద్యా వాలంటీర్లను కొనసాగించాలని, ఏజెన్సీలో 100శాతం ఉద్యోగాలు ఆదివాసీలకే ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం మండల కార్యదర్శి ఎం.ధర్మారావు, కార్మిక సంఘాల నాయకులు పి.దేవేంద్ర, ఎస్.పాల్గుణరావు, ఎస్.భావన్న, భాస్కరరావు, కృష్ణారావు, అప్పలస్వామిలు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబర్చిన 'గీతాంజలి' విద్యార్థులు

విశాలాంధ్ర-నరసన్నపేట : రాష్ట్ర స్థాయి అబాకస్ పోటీల్లో పట్టణానికి చెందిన గీతాంజలి స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబర్చారని స్కూల్ కరస్పాండెంట్, ఆర్.శ్రీనివాస రావు తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ విజయవాడలోని విశ్వం ఎడ్యుటెక్ స్కూల్ ల్యాబ్ నిర్వహించిన రాష్ట్రస్థాయి అబాకస్ పోటీల్లో గీతాంజలి స్కూల్‌కు చెందిన విద్యార్థులు బోగి నిషిత(4వ తరగతి) ప్రథమ బహుమతి కైవసం చేసుకోగా, పొట్నూరు జ్యోతి ప్రకాష్(5వ తరగతి) ద్వితీయ బహుమతి సాధించారని అన్నారు. వీరిద్దరూ జాతీయ స్థాయిలో జరిగే అబాకస్ పోటీలకు ఎంపికైనారని, విజయవాడలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో సుమారు 450 పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారని తెలిపారు. వీరిలో నరసన్నపేట గీతాంజలి స్కూల్‌కు చెందిన విద్యార్థులు జాతీయ స్థాయిలో పోటీలకు ఎంపిక కావటం అభినందనీయమన్నారు. విద్యార్థులకు అభినందనలు తెలిపినవారిలో గీతాంజలి స్కూల్ గౌరవ అధ్యక్షులు, కె.వి.శివప్రసాద్, ప్రిన్సిపాల్, కె.కోటిబాబు, ఉపాధ్యాయులు వున్నారు.

జలుమూరు : స్కూల్ లేబ్స్ వారు మన కళ్యాణమండపం, శాంతనగర్, విజయవాడలో రాష్ట్రస్థాయి వేదిక్ మేథ్స్ పోటీలలో 26 జిల్లాల నుంచి 450 పాఠశాలల విద్యార్థులు పాల్గొనగా తిమడాం గీతాంజలి పాఠశాల విద్యార్థులకు జూనియర్ లెవెల్-1 నుంచి దుంపల వర్షిణి, రాష్ట్ర స్థాయిలో 3వ ర్యాంక్ సాధించి నేషనల్ లెవెల్‌కు ఎంపికయ్యారు. వీరిని పాఠశాల కరస్పొండెంట్ వెలమల రామచంద్రరావు, ఇతర ఉపాధ్యాయ సిబ్బంది అభినందనలు తెలిపారు.

గ్రామీణ క్రీడలతో యువతలో స్నేహభావం

కాశీబుగ్గ డిఎస్పి నాగేశ్వరరెడ్డి

విశాలాంధ్ర-వజ్రపుకొత్తూరు : గ్రామీణ క్రీడలు ద్వారా యువతలో స్నేహభావం పెంపొందుతుందని తద్వారా పల్లెల్లో శాంతియుత వాతా వరణం వెల్లివిరుస్తుందని కాశీబుగ్గ డిఎస్పి నాగేశ్వరరెడ్డి అన్నారు. జిల్లా ఎస్పి జి.రాధిక ఆదేశాలమేరకు స్థానిక ఎస్ఐ సిహెచ్. రామారావు ఆధ్వర్యంలో జరుగుతున్న ఎస్పి కప్ టోర్నమెంట్‌ను నగరంపల్లి ఉన్నత పాఠశాల మైదానంలో ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా డిఎస్ పి.నాగేశ్వరరెడ్డి మాట్లాడుతూ పోలీసులు, ప్రజల మధ్య స్నేహపూర్వక సంబంధాలు కొనసాగాలన్నారు. క్రీడా పోటీలు, వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం ద్వారా సత్సంబంధాలు కొనసాగుతాయి అన్నారు. గ్రామీణ క్రీడాకారులలో ప్రతిభ ఉన్నప్పటికీ దానిని వెలికి తీసేందుకు ఇటువంటి టోర్నమెంట్‌లు దోహదపడతాయి అన్నారు. ప్రతిభ కనబరిచే క్రీడాకారులకు మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వాలీబాల్, క్రికెట్ విభాగంలో పోటీలు నిర్వహించగా 16 జట్లు పాల్గొన్నాయి. క్రీడా పోటీలు రెండు రోజుల పాటు జరగనుండగా విజేత లకు ముగింపు కార్యక్రమంలో జిల్లా ఎస్పి జి.రాధిక చేతులమీదుగా బహుమతులు అందించనున్నారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, యువత పాల్గొన్నారు.

జీడి పరిశ్రమలో అగ్ని ప్రమాదం

విశాలాంధ్ర-పలాస : పలాస అన్నపూర్ణ థియేటర్ సమీపంలో ఆదివారం మధ్యాహ్నం జీడి పరిశ్రమలో అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. అగ్ని మాపక అధికారులు, జీడి పరిశ్రమ యజమానులు తెలిపిన కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. పలాస అన్నపూర్ణ థియేటర్ సమీపంలో ఉన్న పలాసకు చెందిన ఎం వెంకటరావు వరుణ్ జీడి పరిశ్రమ ఉంది. జీడి పరిశ్రమకు అనుకొని పరిశ్రమకు సంబంధించిన వృధాగా పడిఉన్న డబ్బాలు, చెత్త చెదారం ఉండడంతో ఒక్కసారిగా వృధాగా పడిఉన్న డబ్బాలకు మంటలు వ్యాపించాయి. జీడి పరిశ్రమ సమీపంలో మంటలు వ్యాపించాయనే విషయం జీడి యజమానులు తెలుసుకొని పరిశ్రమ వద్దకు పరుగులు తీశారు. జీడి పరిశ్రమ వద్ద అగ్ని ప్రమాదం జరిగిందని అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో మంటలను అదుపు చేశారు. అగ్ని ప్రమాదానికి విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్లే అగ్ని ప్రమాదం సంభవించిందని అగ్నిమాపక సిబ్బంది తెలిపారు. అగ్ని ప్రమాదంలో పరిశ్రమకు చెందిన విద్యుత్ లైన్లు కాలి బూడిదైందన్నారు. అగ్ని ప్రమాదంలో ఎటువంటి ప్రాణి, ఆస్తి నష్టం జరగలేదని అగ్నిమాపక ఎస్సై సోమేశ్వరరావు తెలిపారు.

పదవ తరగతి విద్యార్థులకు కిట్లు పంపిణీ

విశాలాంధ్ర - సోంపేట : సత్య సాయి యువజన విభాగం ఆధ్వర్యంలో ఆదివారం బీసీ హాస్టల్, ఎస్సీ హాస్టల్‌లోని పదవ తరగతి విద్యార్థినులకు పరీక్ష ప్లాంక్, పెన్, పెన్సిల్, ఎరేజర్, స్కేల్ తదితర సామాగ్రితో కూడిన కిట్లును అందజేశారు. ఈ కార్యక్రమంలో ఈపరి రవి, వుట్ల రాంప్రసాద్, తిరుమల, తంగుడు శ్రీను, మేకప్ శ్రీను, వడగ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలోకి 60 కుటుంబాలు చేరిక

విశాలాంధ్ర-మందస : మండలంలో మందస పంచాయితీ మేఘమాల గ్రామానికి చెందిన 30 కుటుంబాలు, నర్సింగిపురం పంచాయతీ గాంధ్రుగాం గ్రామానికి చెందిన 50 కుటుంబాలు ఆదివారం పలాస నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జీ గౌతు శిరీషా ఆధ్వర్యంలో టీడీపీ పార్టీలోకి చేరారు. వీరిని పలాస టీడీపీ కార్యాలయంలో కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ టీడీపీ అధికారం చేపట్టిన వెంటనే వారి సమస్యలు పరిష్కరిస్తామని అన్నారు. కార్యక్రమంలో బావన దుర్యోదన, రట్టి లింగరాజు, లబ్బ రుద్రయ్య, దాసరి తాతారావు, తిరుపతిరావులు పాల్గొన్నారు.

దుర్గమ్మ ఆలయంలో చోరీ

2 తులాల బంగారం అపహరణ

విశాలాంధ్ర-మందస : మండలం బేతాళపురం గ్రామంలో శ్రీదుర్గాదేవి ఆలయంలో చోరీ జరిగింది. అర్చకురాలు అంబటి శ్యామల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఇనుప తలుపు తాళాలు బద్దలు కొట్టి దుండగులు ఆలయంలోకి చొరబడ్డారని, మూడు జతల శతమానాలు, ఒక పాపిడిదిద్దు, ఒక ముక్కుపుడక మొత్తం రెండుతులాల బంగారం అపహరణకు గురైందని తెలిపారు. ఆలయంకు సీసీ కెమెరాలు లేవు. అర్చకురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వాలంటీర్‌కు హెల్పింగ్ హాండ్స్ సభ్యులు ఆర్థిక సాయం

విశాలాంధ్ర-కవిటి: మండలంలోని మాణిక్యపురం గ్రామానికి చెందిన గ్రామ వాలంటీర్ దిలీప్ దోలై కు హ్యాండ్ సభ్యులు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. దిలీప్ దోలై గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న విషయాన్ని తెలుసుకున్న హెల్పింగ్ హాండ్ సభ్యులు పిఎసిఎస్ చైర్మన్ దేవరాజు సాహు చేతుల మీదుగా 5,500 వేల రూపాయలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా హెల్పింగ్ హాండ్స్ సభ్యులకు పిఎసిఎస్ అధ్యక్షుడు దేవరాజ్ సాహూ, గ్రామస్తులు అభినందించారు. ఈ కార్యక్రమంలో హెల్పింగ్ హాండ్ సభ్యులు పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

విశాలాంధ్ర-సంతబొమ్మాళి : మండల సర్వ సభ్య సమావేశం ఈనెల 11న మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి మేరుగు రాజేశ్వరి అధ్యక్షతన జరుగుతుందని ఎంపీడీవో జి ఉమాసుందరి తెలిపారు. ఉదయము 10 గంటలకు జరుగుతుందని, సమావేశానికి సకాలంలో ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరు కావాలని ఆమె కోరారు.

స్వచ్ఛభారత్ మనందరి బాధ్యత

గోవిందపురం సర్పంచ్ రామిరెడ్డి

విశాలాంధ్ర-సంతబొమ్మాళి : స్వచ్ఛ భారత్ మనందరి బాధ్యత అని గోవిందపురం పంచాయితి సర్పంచ్ రెయ్యి రామిరెడ్డి అన్నారు. ఆదివారం పంచాయతీలో తడి పొడి చెత్త వేసే డ్రమ్ములను ప్రజలకు పంపిణీ చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మీ ఇళ్ళ ముందు ఎటువంటి చెత్త లేకుండా చేసి, సరఫరా చేసే డ్రమ్ములలో వేయాలని కోరారు. ఈకార్యక్రమంలో వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, వాలంటీర్లు పాల్గొన్నారు.

శ్రీముఖలింగేశ్వరంలో చక్రతీర్థ స్నానాలకు వంశధారలో నీరు కరవు

విశాలాంధ్ర-జలుమూరు : మండలం శ్రీముఖలింగేశ్వరస్వామి క్షేత్రంలో జరిగే ఉత్సవాల్లో అత్యంత విశిష్టమైన ఘట్టం స్వామి చక్ర తీర్థ స్నానం. వంశధార నదిలో రేవు వద్ద సోమవారం ఈ వేడుక నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే నదిలో బారికేడ్లు సిద్ధం చేశారు. శనివారం నాటికి ఏర్పాట్ల ప్రదేశంలో నీరు లేదు. లక్షలాది మంది హాజరై పుణ్యస్నానాలు చేయనున్న నేపథ్యంలో నీరు విడిచిపెట్టాలని భక్తులు కోరుతున్నారు.

మహిళల ఆర్థిక అభివృద్ధే లక్ష్యం : ఎమ్మెల్యే కిరణ్ కుమార్

విశాలాంధ్ర-రణస్థలం: మండలం జే.ఆర్.పురం పంచాయతీలో ఏర్పాటు చేసిన వై.యస్.ఆర్ చేయూత 4 విడత చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొని నాలుగో విడత వైస్సార్ చేయుతా మంజూరు చెక్కును మహిళలకు అందజేశారు. ముందుగా దివంగతనేత డాక్టర్ రాజశేఖర్ రెడ్డి చిత్రపటానికి పూలమాలలువేసి ఘన నివాళులర్పించారు. అనంతరం సీఎం వైయస్ జగన్మోహన్ రెడ్డి చిత్రపటానికి పాలభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఎచ్చెర్ల ఎమ్మెల్యే మాట్లాడుతూ రణస్థలం మండలంలోని 6437మంది మహిళలకు వైయస్ఆర్ చేయూతద్వారా నాలుగు విడతల్లో పన్నెండుకోట్ల ఆరు లక్షల తొంబై మూడు వేల ఏడు వందల యాభై రూపాయలు (12,06,93,750/-)చెక్కును మహిళా సంఘ సభ్యులకు ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ చేతుల మీదుగా అందజేశారు. మహిళల సమగ్రాభివృద్ధికి-సాధికారతకు మహిళల సుస్థిర జీవనోపాధికి వైయస్ఆర్ చేయూత పథకం అమలు, 45 ఏళ్ల వయసు నుండి 60 ఏళ్ళ లోపు వయసు గల మహిళలకు ప్రతిఏటా రూ. 18,750లు చొప్పున నాలుగు విడతల్లో ప్రతి మహిళకు రూ. 75వేల ఆర్థిక సహకారం అందజేస్తుందన్నారు. జగనన్న అందించిన సంక్షేమ పథకాల సహాయంతో మహిళలు ఆర్థికంగా నిలదొక్కోవడానికి ప్రభుత్వం సహకారం అందజేస్తుందని.. మహిళలు ఈ సహకారాన్ని సద్వినియోగం చేసుకొని తమ కుటుంబాలను ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలని సూచించారు. రిజిస్ట్రేషన్ పట్టాలు ఇవ్వడం వల్ల అక్క చెల్లెమ్మలకు ఆస్తి మీద పూర్తి హక్కు. భవిష్యత్తులో రిజిస్ట్రేషన్లు క్యాన్సిల్ చేసే అవకాశం ఎవరికీ లేదన్నారు. దేశ చరిత్రలోనే 31 లక్షల మంది పేదలకు ఇళ్ల పట్టాలు ఇచ్చిన ఘనత ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డిదని, ఎక్కడ కులం, మతం, ప్రాంతం, వర్గం, చివరకు ఏపార్టీ అని చూడకుండా ఓటు వేయకపోయినా పర్వాలేదు అర్హత ప్రామాణికంగా ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం లబ్ధి చేకూరుస్తుందన్నారు. అక్క చెల్లెమ్మలు బాగుంటేనే కుటుంబం, రాష్ట్రం బాగుంటుందని.. మహిళ సాధికారతకు పెద్దపీట వేసిన జగనన్న ప్రభుత్వం చేయూత ఆసరా లాంటి పథకాలతో వారంతా ఆర్థికంగా తమ కాళ్లపై నిలబడేలా.. సంక్షేమ పథకాలను అందిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి,రణస్థలం మండలం ఎంపీపీ ప్రతినిధి పిన్నింటి సాయికుమార్,రణస్థలం మండలం జడ్పీటీసీ టొంపల సీతారాం,వైస్ ఎంపీపీ రాయపురెడ్డి బుజ్జి,వైస్ ఎంపీపీ ప్రతినిధి మైలపల్లి కామరాజు, మహిళా విభాగం అధ్యక్షురాలు గురాన మానస, వెలుగు ఏసీ రవికుమార్, ఏపీఎం వెంకటరత్నం, వైస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు రణస్థలం మండలం సర్పంచ్లు, ఎంపీటీసీలు, గ్రామ సచివాలయం కన్వీనర్లు, వైస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, గృహ సారథులు, సీసీలు, సీఎఫ్‌లు, మహిళా సంఘాల అక్కచెల్లెమ్మలు తదితరులు పాల్గొన్నారు.

తర్లాకోట సచివాలయ ఉద్యోగి నిర్లక్ష్యం

- అర్హుడికి మొండి చేయి... అనర్హుడికి అందలం.
- అనర్హుడి ఖాతాకు రూ. 90 వేలు జమ..!

విశాలాంధ్ర-పలాస : పలాస మండలం తర్లాకోట గ్రామ సచివాలయ ఉద్యోగి నిర్లక్ష్యం వలన పేద గిరిజనుడికి అన్యాయం జరిగింది. దానగొరకు చెందిన జగనన్న కాలనీ ఇళ్ల లబ్ధిదారుడికి సచివాలయ ఇంజనీరింగ్ సహాయకుడు మొండి చేయి చూపారు. లబ్ధిదారుడికి మంజూరైన సొమ్ము వేరొకరి ఖాతాకు జమ చేసి నిజమైన లబ్ధిదారుడికి అన్యాయం చేశారు. ముఖ్యమంత్రి జగన్ ఆశయానికి తూట్లు పొడిచి నిరుపేద గిరిజనుడు కట్టుకుంటున్న గూడుకు బిల్లులు చెల్లించకుండా అనర్హుడికి సొమ్ములు ముట్ట జెప్పి తన వాటా సొమ్ము కమీషన్ రూపంలో నొక్కేసిన సచివాలయ ఉద్యోగి తీరుపై బాహాటంగా విమర్శలు వినిపిస్తున్నాయి.

పలాస మండలం దానగొర గిరిజన గ్రామానికి చెందిన సవర ఆనంద్‌కు 2022లో జగనన్న కాలనీలో ఇళ్ల స్థలం మంజూరైంది. ఆనంద్ భార్య కవితతో కలిసి కూలీ పనులతో వచ్చిన డబ్బులతో జీవనం సాగిస్తున్నారు. జగనన్న కాలనీలో ఇళ్ల స్థలం మంజూరైన నేపథ్యంలో అప్పులు చేసి పునాదులు వేసుకున్న ఆనంద్ కుటుంబం హౌసింగ్ స్కీం కింద తనకు మంజూరైన మొదటివిడత బిల్లు తన ఖాతాలో జమ చేయాలని తర్లాకోట గ్రామ సచివాలయం ఉద్యోగిని సంప్రదించారు. సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్ లబ్ధిదారుల వివరాలకు సంబంధించి పత్రాలు తీసుకుని శ్లాబ్ మట్టం వరకు నిర్మాణం చేసిన తర్వాత వస్తే ఎస్టిమేషన్ వేసి తొలి, మలి విడత బిల్లులు ఖాతాలో జమ చేస్తామని చెప్పి పంపించేశారు. శ్లాబ్ వరకు నిర్మించి బిల్లులు కోసం రెండేళ్లుగా తర్లాకోట గ్రామ సచివాలయంలోని ఉద్యోగి చుట్టూ కాళ్లు అరిగేలా తిరిగినా బిల్లులు మంజూరు చేయకుండా కాలయాపన చేస్తునే ఉన్నారు. ఈ నేపథ్యంలో హౌసింగ్ బిల్లుల కోసం సచివాలయ ఉద్యోగి దగ్గరకు వెళ్లిన లబ్ధిదారుడికి బిల్లులు ఖాతాలో జమ అవుతాయని, అస్తమానం సచివాలయానికి రావొద్దని సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్ ఆదేశించారని బాధితులు తెలిపారు. ఇళ్ల నిర్మాణం కోసం అప్పులు ఊబిలో కూరుకు పోయిన లబ్ధిదారుడు ఆనంద్ కొంత కాలం వేచి చూసి శ్రీకాకుళంలోని హౌసింగ్ శాఖ కు వెళ్లి తన గోడు వినిపించారు. అక్కడి అధికారులు రికార్డులు తనిఖీలు చేసి సమగ్రంగా విచారణ చేయగా పలాస మండలంలోని ఓ ప్రభుత్వ పాఠశాలలో ఔటు సోర్సింగ్ ఉపాధ్యాయుడి గా విధులు నిర్వహిస్తున్న సవర ఆనంద్ ఖాతా కు తన ఇళ్ల నిర్మాణం బిల్లులు జమ అయినట్టు గుర్తించారు. ఈవిషయమై లబ్ధిదారుడు సచివాలయ ఉద్యోగిని బిల్లుల విషయమై నిలదీశారు. అనర్హుడి ఖాతాలో జమ చేసిన సొమ్ము రికవరీ చేయాల్సిన ఇంజనీరింగ్ అసిస్టెంట్ తనకేమీ సంబంధం లేదని చేతు లెత్తేయడంతో బాధిత లబ్ధిదారుడు ఖంగు తిన్నాడు. తనకు తీరని అన్యాయం జరిగిందని తలచి లబ్ధిదారుడు సవర ఆనంద్ ఈ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి తనకు న్యాయం చేయాలని పిర్యాదుల రూపంలో విజ్ఞప్తి చేసిన నేపథ్యంలో దర్యాప్తు కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. ఇదిలా ఉండగా సచివాలయ ఇంజనీరింగ్ సహాయకుడు నిజమైన లబ్ధిదారుడికి అన్యాయం చేసి స్వాహా చేసిన సొమ్ము ను ఔటు సోర్సింగ్ ఉపాధ్యాయుడితో కలిసి పంచుకున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

సచివాలయ ఉద్యోగి కాసులకు కక్కుర్తి పడి అనర్హుడిని లబ్ధిదారుడిగా చూపుతూ ఆధార్ సీడింగ్ చేసినట్లు తెలుస్తోంది. ఎటువంటి ఇంటి నిర్మాణం చేయని అనర్హుడి ఖాతాకు రూ. 90 వేలు జమ చేసిన తర్లాకోట గ్రామ సచివాలయ ఉద్యోగి రూటే సెప 'రేటు' అని కమీషన్ లేనిదే ఫైల్ కదలదనే విమర్శలు స్థానికుల నుంచి వెల్లువెత్తుతున్నాయి. సచివాలయ ఇంజనీరింగ్ సహాయకుడు పొరపాటు వలన ఔటు సోర్సింగ్ ఉపాధ్యాయుడి ఖాతాలో జమ చేసిన సొమ్ము తమకు ఇచ్చేయాలని బాధితుడు ఆనంద్ ప్రాధేయపడినప్పటికీ ఇవ్వకుండా ఆ ఒప్పంద ఉద్యోగి బెదిరింపులకు పాల్పడుతున్నారని బాధిత లబ్ధిదారుడు వాపోతున్నారు. తర్లాకోట గ్రామ సచివాలయ ఉద్యోగి చుట్టూ కాళ్ల అరిగేలా తిరిగినప్పటికీ అనర్హుడు నొక్కేసిన సొమ్ము ను వసూలు చేయకుండా సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్ రెండేళ్లుగా జాప్యం చేస్తున్నారనే బాధితుడు ఆనంద్‌తో పాటు కుటుంబీకులు ఆరోపించారు. ఇప్పటికైనా బిల్లులు చెల్లించి తమకు న్యాయం చేయాలని బాధితులు కోరుతున్నారు. హౌసింగ్ బిల్లుల సొమ్ము స్వాహా విషయమై హౌసింగ్ డిఈఈ కూడా అనర్హుడి నుంచి సొమ్ము రికవరీ చేసే బాధ్యత హౌసింగ్ ఏఈ, ఇంజనీరింగ్ సహాయకుడు వహించాలని ఆదేశించినట్లు సమాచారం. ఉపాధ్యాయుడు అకౌంట్‌లో జమ అయిన సొమ్ము ఇవ్వనని నిరాకరిస్తే పోలీసులకు పిర్యాదుచేసి చట్టపరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించినట్లు బోగట్టా. ఈ విషయమై తర్లాకోట గ్రామ సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్ ఆరి వేంకటేశ్వరరావు ను వివరణ కోరగా జగనన్న కాలనీ ఇళ్ల నిర్మాణ బిల్లులకు సంబంధించి లబ్ధిదారుడైన సవర ఆనంద్ వివరాలన్నీ ఆన్‌లైన్‌లో పెట్టామన్నారు. కాక పోతే ఆధార్ నెంబర్ మాత్రం ఔటు సోర్సింగ్ ఉపాధ్యాయుడు ఆనంద్ ది నమోదు చేసి పొరపాటు చేశానని అంగీకరించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామని ఇంజనీరింగ్ అసిస్టెంట్ వెంకటేష్ వెల్లడించారు.

వైసీపీ పథకాలపై ఇంటింటి ప్రచారం

విశాలాంధ్ర-కొత్తూరు : మండలం నీలకంఠాపురం గ్రామంలో ఆదివారం సీఎం జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివిధ కార్యక్రమాలను ఆ పార్టీ మండల కమిటీ ప్రధాన కార్యదర్శి మతం పూర్ణా అధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి ప్రజలకు వివరించారు. ముద్రించిన కరపత్రాలను అందజేశారు.రానున్న ఎన్నికల్లో వైసీపీ తరుపున పోటీ చేసే అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైసీపీ స్థానిక నాయుకులు గేదెల చిన్నబాబు, గేదెల నర్సింహులు, గంటే రమేష్ తదతరులు పాల్గొన్నారు.

ఎన్నికల శిక్షణా తరగతుల కారణంగా నేడు స్పందన రద్దు

డిఆర్ఓ ఎం.గణపతిరావు

విశాలాంధ్ర-శ్రీకాకుళం : ప్రతీ సోమవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహిస్తున్న వినతుల స్వీకరణ (స్పందన) కార్యక్రమం నేడు అనగా మార్చి 11 సోమవారం స్థానిక అంబేద్కర్ అడిటోరియంలో ఎన్నికల శిక్షణా తరగతుల జరుగనున్న కారణంగా స్పందన కార్యక్రమము నిర్వహించబడదని డిఆర్ఓ, ఎం.గణపతిరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

13న కామ్రేడ్ అరుణాచారి స్థూపం ఆవిష్కరణ

విశాలాంధ్ర-సోంపేట : మండలం మామిడిపల్లి గ్రామం వద్ద ఈనెల 13న తొలితరం కమ్యూనిస్టు నేత, పోరాట యోధుడు కామ్రేడ్ గానుగుల అరుణాచారి స్థూపాన్ని ఆవిష్కరించనున్నట్లు సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం మామిడిపల్లి గ్రామాన్ని సందర్శించి కామ్రేడ్ సుందరయ్య విగ్రహానికి పూలమాలలు వేసి అక్కడ నుంచి ర్యాలీగా వెళ్లారు. ఈ కార్యక్రమంలో పాతిన కృష్ణమూర్తి, జుత్తు సింహాచలం, ఎస్.లక్ష్మినారాయణ, కె.మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ, టీడీపీ, జనసేన పొత్తు అనైతికం

విశాలాంధ్ర-శ్రీకాకుళం టౌన్ : బిజెపి టిడిపి జనసేన పొత్తు అనైతికమని జై భారత్ నేషనల్ పార్టీ పార్లమెంటరీ కోఆర్డినేటర్ ఇప్పిలిసీతరాజు లీగల్ సెల్ కన్వీనర్, అధికార ప్రతినిధి చౌదరి లక్ష్మణరావు అసెంబ్లీ కోఆర్డినేటర్ రాగోలు నాగశివ ఒక ప్రకటనలో తెలియజేశారు. రాష్ట్రానికి రావలసిన ప్రత్యేక హెూదా, విభజన హామీలను విశాఖ రైల్వే జోన్ విశాఖ ఉక్కు ఫ్యాక్టరీపై, రాతపూర్వకమైన హామీ తీసుకొని, పొత్తు కుదుర్చుకోవాలి కానీ వ్యక్తిగత, రాజకీయ, స్వప్రయోజనాల కోసం, ఈ పొత్తు కుదిరిందన్నారు. ఈ మూడు పార్టీల కార్యకర్తలు ఎన్నో ఏళ్ల నుంచి పార్టీ కోసం కష్టపడి ఈ పొత్తు వల్ల నష్టపోయారన్నారు.

లబ్బాలో కమ్యూనిటీ పోలీసింగ్ వైద్యశిబిరం

విశాలాంధ్ర-కొత్తూరు : సమాజంలో ప్రజలతో మమేకం కావడానికి అప్పుడపుడు కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా సేవా కార్యక్రమాలను చేపడుతున్నట్లు జిల్లా ఎస్పీ రాధికా ఆదివారం కొత్తూరు మండలం లబ్బ గ్రామంలో ఏర్పాటుచేసిన ఉచిత మెఘా వైద్యశిబిరంలో ఆమె మాట్లాడారు. గ్రామాల్లో పేద ప్రజల కోసం మీ చెంతకే వచ్చి వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఏదైనా అనారోగ్య పరిస్థితులు వస్తే అశ్రద్ధ చెయ్యకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని, అవసరమైన మందులను ఉచితంగా పొందాలన్నారు. ఈ

వైసీపీలో భారీ చేరికలు

విశాలాంధ్ర-శ్రీకాకుళం రూరల్: నగరంలో పలువార్డులలో టిడిపి, జనసేన కూటమి యువకులు ఆదివారం సుమారు 120 మంది, రాష్ట్ర రెవిన్యూ శాఖామాత్యులు ధర్మాన ప్రసాదరావు సమక్షంలో, మండవిల్లి రవి, ఈశ్వరరావు ఆధ్వర్యంలో వైసీపీలో చేరారు. ఇందులో భాగంగా చేరిన యువతకు ధర్మాన, పార్టీకండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా యువత మాట్లాడుతూ వైసీపీ అమలుపరుస్తున్న సంక్షేమ పథకాలకు, ధర్మాన చేస్తున్న జిల్లా అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులమై పార్టీలోకి వచ్చామని, ధర్మాన ప్రసాదరావు గెలుపే లక్ష్యంగా నిర్విరామంగా శ్రమిస్తామన్నారు. అనంతరం జై ధర్మాన, జై జై ధర్మాన, జైజగన్, జైవైసీపీ అంటూ ప్రాంగణ మంతా హెూరెత్తించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు, మామిడి శ్రీకాంత్, వైసీపీ ప్రతినిధులు, యువత పాల్గొన్నారు.

శ్రీముఖలింగేశ్వర స్వామి తిరువీధి 12 గంటలకు ప్రారంభం

విశాలాంధ్ర-జలుమూరు: శ్రీముఖలింగేశ్వర స్వామిని వంశధార నదీ తీరంలో చక్రతీర్థ స్నానాలాచరించేందుకు ఆలయం నుంచి సోమవారం మధ్యాహ్నం 12.02 నిమిషాలకు తిరువీధి బయలుదేరు తున్నట్లు ఈవో వి ప్రభాకరరావు తెలిపారు. ఉత్సవమూర్తులను ఊరేగింపుగా మిరియపల్లి గ్రామం వద్ద వంశధార నదిలో చక్రతీర్థ స్నానాలు చేయిస్తారని చెప్పారు. ఈ సమయంలో లక్షలాది మంది భక్తులు వివిధ ప్రాంతాల నుంచి హాజరవుతారని ఆయన అన్నారు.

తోటాడలో మాజీ సైనికులకు పౌర సన్మానం

విశాలాంధ్ర-ఆమదాలవలస: తోటాడ గ్రామంలో గ్రామ ప్రజలు, యువత ముందుకు వచ్చి తమ గ్రామంలోనున్న మాజీ సైనికులను, ప్రస్తుతం సైన్యంలోనున్న సైనికులను సత్కరించి వారి సేవలను కొనియాడారు. ఆదివారం జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా మాజీ సైనికుల సమాఖ్య అధ్యక్షుడు పూర్ణ చంద్రరావు కటకం అధ్యక్షత వహించారు. బూర్జ మండలం, తోటాడలో ఆర్మీ, నేవీ మరియు ఎయిర్ ఫోర్స్ నుండి సుమారు ఒక 75 మంది వరకు మాజీ సైనికులు, ప్రస్తుత సైన్యంలో సైనికులుగా ఉన్నారని కార్యక్రమం నిర్వాహకులు రిటైర్డ్ ట్రెజరీ ఆఫీసర్ గేదెల వెంకట అప్పల నాయుడు అన్నారు. అలానే ముఖ్య అతిథిగా విచ్చేసిన రిటైర్డ్ జడ్జ్ కంది విజ్ఞాన్ మాట్లాడుతూ మనకి ఆర్మ్డ్ ఫోర్సెస్ గురించి అవగాహన వుండాలని వాళ్ల డ్యూటీ విలువ తెలిసినప్పుడు మాత్రమే వారిపట్ల మనకు ఇంకా గౌరవం పెరుగుతుందనీ వ్యాఖ్యానించారు. తన అన్నయ్య కూడా ఒక రిటైర్డ్ ఎయిర్ ఫోర్స్ అని గుర్తుచేసుకున్నారు. విశిష్ట అతిథిగా విచ్చేసిన ఎక్స్ ఎమ్.ఎల్.సీ. పీరుకట్ల విశ్వ ప్రసాద్ మాట్లాడుతూ ప్రాణాలకు కూడా లెక్క చేయక దేశ సేవచేసే వ్యక్తులు మన సైనికులు అని ఇలాంటి వారు మన తోటవాడలో కూడా ఉండడం గర్వనీయం అని పేర్కొన్నారు. గ్రామ పెద్దలు, యువత కోరిన విధంగా జిల్లాలో విద్యార్థులకు ఆర్మీ, నేవీ, ఎయిర్ ఫోర్స్‌లలో జాయిన్ అవ్వాలంటే కావాల్సిన శిక్షణను ఉచితంగా అందే టట్లు జిల్లాలో ఒక ఆర్మీ అకాడమీ ప్రభుత్వ ము ఏర్పాటు చేయాలని తన డిమాండ్ చేశారు. సర్వీస్‌లో సైనికులుగా ఉన్నప్పుడు దేశ సేవ చేసి ఇప్పుడు సర్వీస్ నుంచి బయటకు వచ్చిన తరువాత సొసైటీకి తమ వంతు సేవ చేయడం చాలా ఆనందంగా ఉంది అని అధ్యక్షులు అన్నారు. మా డిస్ట్రిక్ట్ ఎక్స్ సర్వీస్‌మెన్ ఫెడరేషన్ శ్రీకాకుళం ఉద్దేశ్యం ఒకటే, ఒక సమాజం పట్ల సైనికుడు బాధ్యత తెలియజేయడమే. ఒక క్రమ శిక్షణ మరియు సేవా భావం ప్రతీ సైనికుని నరనరాల్లో ఉందని, అదే విషయాన్ని నేటి సమాజానికి తెలియజేసి భావి పౌరులను ఆర్మ్డ్ ఫోర్సెస్‌లో చేరేవిధంగా ప్రేరేపించ డమే తమ ముఖ్య ఉద్దేశ్యం అని, మాజీ సైనికుల సమాఖ్య జిల్లా అధ్యక్షుడు పూర్ణ చంద్రరావు కటకం తెలిపారు. ఈ కార్యక్రమంలో జనరల్ సెక్రటరీ వి.మురళీధరరావు, మాజీ సైనికులు దన్నాన ఆనందరావు, గేదెల గోవిందరావు, గ్రామ పురప్రజలు, పెద్దలు, మహిళలు, యువత పాల్గొన్నారు.

ఉపముఖ్యమంత్రి నారాయణస్వామి క్షమాపణ చెప్పాలి

స్వామి శ్రీనివాసానంద డిమాండ్

విశాలాంధ్ర-పొందూరు: హిందువుల పవిత్రస్థలం తిరుమల తిరుపతిలో నిభందనలకు విరుద్ధంగా రాజకీయ వ్యాఖ్యలు చేసిన ఉపముఖ్యమంత్రి నారాయణస్వామి రాష్ట్ర ప్రజలకు క్షమాపణలు చెప్పాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పరిషత్ అధ్యక్షులు, ఆనందాశ్రమ పీఠాదిపతి స్వామి శ్రీనివాసనంద అన్నారు. మండలం కృష్ణాపురం ఆనందాశ్రమంలో ఆదివారం విలేఖరుల సమావేశంలో మాట్లాడారు.. శ్రీవారి దర్శనానికి వెళ్ళిన నారాయణస్వామి బయటకు వచ్చి జగన్ భజన చేయడం రాజకీయాలు మాట్లాడడం తగదన్నారు. గత ప్రభుత్వ సమయంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలకు పెద్దపీట వేస్తే ఈ వైసీపీ ప్రభుత్వంలో మంత్రులు, నాయకులు రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. రాజ్యాంగాన్ని పరిరక్షించాల్సిన ముఖ్యమంత్రి జగన్మోహన రెడ్డి తను అన్యమతస్తుడైనా తిరుమల దేవస్థానంలో కనీసం సంతకం చేయకుండా దర్శనానికి వెళ్ళారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఐదేళ్ళలో ఒక్కసారికూడా బ్రహ్మోత్స వాలకు సతీసమేతంగా హాజరుకాకుండా హిందువులు, ముఖ్యంగా వెంకటేశ్వరస్వామి భక్తులకు అవమానించారన్నారు. నారాయణస్వామి తిరుమల ను రాజకీయవేదికగా మలచుకోవడం క్షమించరాని నేరమన్నారు. తిరుమల పవిత్రతను దిగజారుస్తున్న వైసీపీ ప్రభుత్వానికి రాష్ట్రప్రజలు బుద్దిచెబుతారన్నారు.

టిడిపి నాయకుల సూపర్ సిక్స్ ప్రచారం

విశాలాంధ్ర-టెక్కలి: మండలం కొనుసులు కొత్తూరు పంచాయతీలో టిడిపి సూపర్ సిక్స్ కార్యక్రమం రాష్ట్ర తెదేపా అధ్యక్షులు కింజరాపు అచ్చెన్నాయుడు ఆదేశాలమేరకు టెక్కలి మండల తెదేపా నేతలు ప్రతీ కుటుంబాన్ని కలిసి తెదేపా ప్రభుత్వం అధికారంలోకి రావడానికి అందరూ ఆశీర్వదించాలని మన భవిష్యత్తు మన చేతుల్లోనే ఉందని గ్రామస్తులకు వివరించారు. ఈ కార్యక్రమంలో టెక్కలి మండల అధ్యక్షులు బగాది శేషగిరి రావు, హనుమంతు రామకృష్ణ, మెండ దమయంతి, దల్లి ప్రసాద్ రెడ్డి, పంగ తవిటయ్య, మక్కా శంకర్ రెడ్డి, పరపటి చిన్నాయా రెడ్డి, గుంటూరౌతు గణేష్, ధర్మాన రాజు, లోపింటి సూర్యనారాయణ, పేరా సాయి, టంకాల బాబ్జి, వంగ వసంత్ కుమార్, పొన్నాడ రాజారావు, గుంటూరౌతు వైకాంటరావు, రమేష్, సాధు జోగారావు, బొడ్డేపల్లి షణ్ముఖ రావు, బొడ్డేపల్లి లచ్చు, పంగ మన్మదరావు, తురక వెంకటేష్, బొల్ల యోగి, వాకాడ రవి, చల్ల అప్పన్న, సాహుకరి మోహనరావు, కొనుసులు కొత్తూరు పంచాయతీ తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నియోజకవర్గాన్ని అన్నివిధాల అభివృద్ధి చేశాం

జడ్పీ చైర్పర్సన్ పిరియా విజయ సాయిరాజ్

విశాలాంధ్ర-కవిటి : వైసిపి అధికారంలోకి వచ్చి నియోజకవర్గాన్ని అన్నివిధాల అభివృద్ధి చేశామని జడ్పీ చైర్పర్సన్ పిరియా విజయ సాయిరాజ్ అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈమేరకు ఆదివారం కవిటి మేజర్ పంచాయతీ గొండ్యాల పుట్టుగ గ్రామంలో ఎమ్మెల్సీ నర్తు రామారావుతో కలిసి జడ్పీ చైర్పర్సన్ పిరియా విజయ సాయిరాజ్ పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. గొండ్యాలపుట్టుగలో 10 లక్షలు రూపాయలు జిల్లా పరిషత్, జి జి ఎంపీ నిధులతో శ్రీశైన సమాజిక భవనం నిర్మాణానికి శంకుస్థాపన అలాగే 5 లక్ష రూపాయలు జిల్లా పరిషత్ నిధులతో మహిళా సామజిక భవనం నిర్మాణానికి శంకుస్థాపన అలాగే 4 లక్షల ఎంపీపీ నిధులతో దుద్ది వెంకటేష్ ఇంటి నుంచి దుద్ది తారకేష్ ఇంటి వరకు సిసి రోడ్డుకు శంకుస్థాపన, 3 లక్షల ఎంపీ పి నిధులతో మండపం వీధి సిసి రోడ్డుకు ఎమ్మెల్సీ నర్తు రామారావుతో కలిసి జడ్పీ చైర్పర్సన్ పిరియా విజయ సాయిరాజ్ శంకుస్థాపన చేశారు. అనంతరం పిరియా విజయ సాయిరాజ్ మహిళలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పంచాయతీకి వైఎస్ఆర్ ప్రభుత్వం చేసిన అభివృద్ధిని, లబ్దిదారులు పొందిన పథకాల లబ్దిని వివరించారు. ఈ పథకాలను మళ్ళీ మనమందరం పొందాలంటే వచ్చే ఎన్నికల్లో వైయస్సార్ ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ప్రతినిధి కడియాల ప్రకాష్, కవిటి మేజర్ పంచాయతి సర్పంచ్ పూడి లక్ష్మణరావు, ఎంపీటీసీలు పూడి నీలాచలం, ఏఎంసి వైస్ చైర్మన్ ఎలమంచి నీలయ్య, మండల జెసి ఎస్ అధ్యక్షుడు జల్లు యుగంధర్, ఎంపీటీసీ సభ్యులు అలిగి హేమలత ధర్మారావు, శంకర్ ప్రాధాన్ మానెక, పీఎం తిలక్, ఎన్ని అశోక్, పిన్నింటి జయరాం,వైయస్సార్ సిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

జడ్యాడ గ్రామాన్ని దత్తత తీసుకొంటా...

- ప్రభుత్వం ఏర్పడిన 24గంటల్లో సాగు, తాగునీరు అందిస్తా
- మౌళిక సదుపాయాలు కల్పిస్తాం... అచ్చెన్నాయుడు

విశాలాంధ్ర-నందిగాం : మండలం కొత్త అగ్రహారం పంచాయతీ జడ్యడ గ్రామాన్ని దత్తత తీసుకుంటానని రాష్ట్ర టిడిపి అధ్యక్షుడు, టెక్కలి ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. గ్రామానికి చెందిన సుమారు 140 వైసీపీ కుటుంబాలు టిడిపిలో చేరిన నేపథ్యంలో గ్రామంలో బమ్మిడి రామస్వామి, నల్ల నారాయణరావు ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన బహిరంగ సభ నిర్వహించారు. అచ్చెన్న పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన 24 గంటల్లో గ్రామానికి తాగునీరు సాగునీరు అందజేస్తామని, అదేవిధంగా నాణ్యమైన రహదారి సదుపాయం కల్పిస్తానని అన్నారు. ఏమీ చేయని వైసీపీ నాయకులు ఏ మొఖం చూసి ఓట్లు అడగడానికి వస్తారని అన్నారు. వైసీపీ పాలనతో ప్రజలు విసిగెత్తిపోయారనే దానికి ఉదాహరణ ఉవ్వెత్తిన వచ్చిన ఈ జనాన్ని చూసే అర్థమవుతుందని అన్నారు. టిడిపి, జనసేన, భాజపా కూటమి అధికారం చేపట్టబోయే రోజు మరెంత కాలమో లేదని అధికారంలోకి వస్తే అవ్వతాతలకు పెన్షన్‌ల పెంపు చేస్తామని అన్నారు. నిరుద్యోగులకు సరైన ఉపాధి కల్పన చేస్తామని తెలిపారు. ప్రజానీకం అభివృద్ధి నా ధ్యేయమని అచ్చెన్నాయుడు అన్నారు. పినకాన అజయ్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో కణితి కిరణ్, మెట్ట పద్మావతి, మల్ల బాలకృష్ణ, పోలాకి చంద్రశేఖర రావు, పైల రమేష్ నాయుడు, కొల్లి హరిబాబు, గుమ్మడి కుర్మయ్య, మధన్ తదితరులు పాల్గొన్నారు.

చక్రతీర్థ స్నానానికి శనివారం 80 క్యూసెక్కుల నీరు విడుదల

- ఆదివారం మరో 150 క్యూసెక్కులు నీరు విడుదల
- వంశధార ఉపకార్య నిర్వాహక ఇంజనీర్- వై అనిల్‌కుమార్

విశాలాంధ్ర-జలుమూరు: చక్రతీర్థ స్నానానికి శనివారం 80 క్యూసెక్కుల నీరు విడుదల చేసినట్లు, ఆదివారం మరో 150 క్యూసెక్కులు నీరు విడుదల విడుదల చేయడం జరుగుతుందని వంశధార ఉపకార్య నిర్వాహక ఇంజనీర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జలుమూరు మండలంలోని శ్రీముఖలింగేశ్వర స్వామి క్షేత్రంలో జరిగే మహాశివరాత్రి ఉత్సవాల్లో అత్యంత విశిష్టమైన ఘట్టం స్వామి చక్రతీర్థ స్నానం. వంశధార నదిలో మిరియాబిల్లి రేవు వద్ద సోమవారం మధ్యాహ్నం 12 గంటల నుంచి ఈ వేడుక నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు పూర్తి, ఇప్పటికే నదిలో బారికేడ్లు సిద్ధం చేశారు. శనివారం నాటికి ఏర్పాట్ల ప్రదేశంలో నీరు లేదు. లక్షలాది మంది హాజరై పుణ్యస్నానాలు చేయనున్న నేపథ్యంలో నీరు విడుదల చేసి భక్తులకు ఎటువంటి అసౌకరం కలగకుండా చర్యలు చేపట్టినట్లు, చక్ర తీర్థ స్నానాలకు అనువుగా నదీ ప్రవాహము లో నీరు అందుబాటులో ఉన్నట్లు ఉపకార్య నిర్వాహక ఇంజనీర్ వై అనిల్ కుమార్ వారు ఒక ప్రకటనలో తెలియజేశారు.

లోతుగడ్డ వర్గం-రాజీనామాలకు సిద్ధం!

విశాలాంధ్ర-మెళియాపుట్టి : పాతపట్నం నియోజకవర్గ పరిధిలో లోతుగడ్డ వర్గీయులు తాము రాజీనామాలకు సిద్ధమని పిలుపునిచ్చినట్లు తెలుస్తుంది. వైఎస్సార్సీపీ జిల్లా కోశాధికారి కొత్తూరు మండల ఉపాధ్యక్షులు, పాతపట్నం నియోజకవర్గ సీనియర్ నాయకుడు లోతుగడ్డ తులసీ వరప్రసాద్ స్థానిక నినాదంతో మండలంలో గడిచిన కొంతకాలంగా తిరుగుతున్న విషయం అందరికీ సుపరిచితమే. అయితే ఇప్పటికే ఆయన స్థానిక నినాదంతో గత కొంతకాలంగా ప్రజల్లోకి వెలుతున్న సందర్భంలో ఇటీవల పాతపట్నం నియోజకవర్గం వైసీపీ అభ్యర్థిగా రెడ్డి శాంతి బరిలో ఉండనున్నట్లు పాతపట్నం నియోజకవర్గంలోని వైఎస్సార్సీపీ నాయకులకు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేసే సమావేశంలో జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ ఉత్తరాంధ్ర డిప్యూటీ సమన్వయకర్త మజ్జి శ్రీను తెలియజేసేరన్న విషయమై స్థానిక నినాదంతోపాటు అసంతృప్తి గలం ఆయన వర్గీయులలో బలంగా వినిపిస్తున్నట్టుగా వారిలో పలువురు తెలియజేస్తున్నారు. దీని దృష్ట్యా పార్టీ విధివిధానాలను ఉల్లంఘించిన క్రమంలో ఆయనకు పార్టీ నుంచి సస్పెండ్ చేసినట్లు ధర్మాన కృష్ణదాస్ ప్రకటించినట్టు వార్తలు రావడంతో ఆయన వర్గీయులు అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. అయితే తనకు పార్టీ కార్యాలయం నుంచి లిఖిత పూర్వకంగా ఎటువంటి ఆదేశాలు అందలేదని ఆయన బహిరంగంగా ప్రకటించినట్టు తెలుస్తుంది. ఇదిలా ఉండగా ఆదివారం మెళియాపుట్టి మండలానికి చెందిన ఆయన వర్గీయులలో కొద్దిమంది మూకుమ్మడిగా రాజీనామాలకు సిద్దమవుతున్నట్టు ఓ ప్రకటనలో తెలిపారు. అయితే ఓవైపు లోతుగడ్డ పిలుపునిచ్చిన స్థానిక నినాదానికి తాము మద్దతుగా నిలుస్తామని, సిట్టింగ్ ఎమ్మెల్యే రెడ్డి శాంతికి తమ వర్గం వ్యతిరేకమని పార్టీకి మాత్రం వ్యతిరేకం కాదని వారు తెలియజేస్తున్నారు. రాజీనామాలు చేసిన వారిలో సర్పంచ్ ప్రతినిది, వార్డు సభ్యుల తోపాటు పార్టీలో నామినేటెడ్ పోస్టులను అనుభవిస్తున్న పలువురు సభ్యులు ఉన్నట్లు సమాచారం. ఏది ఏమైనప్పటికీ ఎన్నికలు దగ్గరకు సమీపిస్తున్న తరుణంలో వైసీపీ పార్టీలో ఇది ఎటువైపుకు దారి తీస్తుందోనని, ఈ ప్రభావం పార్టీలో ఎంత మేరకు ప్రభావితం చేస్తుందోనని పలువురు రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

అందరి అభిమానం పొందడం కొందరికే సాధ్యం

విశాలాంధ్ర-మెళియాపుట్టి : ఉద్యోగులు తమ ఉద్యోగ విధి నిర్వహణ కాలములో ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రతి ఒక్కరి అందరి అభిమానం పొందడం కొంతమంది ఉద్యోగులకు మాత్రమే సాధ్యమని మీడియా పుట్టి జెడ్పిటిసి సభ్యులు గూడ ఎండయ్య అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో గా పనిచేసి బదిలీపై వేరే జిల్లాకు వెళ్లిన ఎంపీడీవో పడాల చంద్రకుమారి, పదోన్నతిపై వేరే ప్రాంతానికి బదిలీ అయిన టైపిస్ట్ హేమలత లకు ఆదివారం నాడు స్థానిక ఎంపిడిఓ కార్యాలయంలోఎంపీడీవో కార్యాలయ సిబ్బంది, కార్యదర్శులు, ఇతర సిబ్బంది ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ సభ్యులు గూడ ఎండయ్య, ఇతర సిబ్బంది మాట్లాడుతూ వారు మండలానికి అందించిన సేవలను గుర్చి కొనియాడారు. ఈ సన్మాన కార్యక్రమంలో వారితో పాటు ఎంపీడీవో కార్యాలయం సిబ్బంది, పంచాయితీ కార్యదర్శులు, ఏపీఎం లలిత, వివిధ శాఖల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన 'బకుడ'

విశాలాంధ్ర-సోంపేట : సోంపేట మండలం ఎంజీపురం పంచాయతీ బకుడ గిరిజన గ్రామం తెలుగుదేశం పార్టీలో చేరింది. ఈ మేరకు ఇచ్ఛాపురం ఎమ్మెల్యే డాక్టర్ బెందాళం అశోక్ ఆదివారం బకుడ గ్రామంలో తెలుగుదేశం పార్టీలో చేరికల కార్యక్రమాన్ని నిర్వహించారు. సుమారు వంద కుటుంబాలు తెలుగుదేశం పార్టీలో చేరడంతో వారందరినీ సాదరంగా శాలువలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అశోక్ మాట్లాడుతూ ఐదేళ్ల వైకాపా పాలన పట్ల విసిగి వేసారిపోయిన ప్రజలు ఎక్కడికక్కడే తెలుగుదేశం పార్టీలో చేరుతున్నారని అన్నారు. త్వరలో జరిగే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ ప్రభంజనం ఖాయమని అన్నారు. గతంలో తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ఎన్నో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టినట్లు వివరించారు. గిరిజనులకు 50ఏళ్లకే పెన్షన్ పథకం చంద్రబాబు హయాంలోనే వచ్చిందని గుర్తు చేశారు. ఎంజీపురం పంచాయతీ అభివృద్ధికి తెలుగుదేశం ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇచ్చిందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మద్దిల నాగేశ్వరరావు, సూరాడ చంద్రమోహన్, చిత్రాడ శ్రీనివాస్, సదానంద రౌళో, మాజీ సర్పంచ్ సంధ్యారాణి, ఉత్తరాల బ్రహ్మానందం, తదితరులు పాల్గొన్నారు.

యువతకు క్రీడలు అవసరం

విశాలాంధ్ర-పలాస: యువతకు చదువుతో పాటు క్రీడలు అవసరమని కాశీబుగ్గ డిఎస్పీ నాగేశ్వర్ రెడ్డి అన్నారు. కాశీబుగ్గ పోలీసు క్రీడా మైదానంలో ఆదివారం ఎస్పీ క్రీడా పోటీల్లో భాగంగా క్రికెట్ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడా కారులు గెలుపు ఓటమిలను సమానంగా తీసుకోవాలన్నారు. క్రీడాలు నిర్వహించాడం వల్ల యువకుల మధ్య స్నేహ సంబంధాలు ఏర్పడుతాయన్నారు. గ్రామ స్థాయిలో ఉన్న క్రీడా కారులు పోటీల్లో పాల్గొనడం వల్ల తమ ప్రతిభ బయట పడుతుందన్నారు. ఆ సమయంలో గ్రామ స్థాయి నుంచి జాతీయ స్థాయి వరకు క్రీడాలో పాల్గొనే అవకాశం లభించిందన్నారు. ఈ పోటీల్లో గెలుపొందిన క్రీడా కారులకు జిల్లా ఎస్పీ రాధిక చేతుల మీదుగా బహుమతులు అందజేయడం జరుగుతుందని చెప్పారు. క్రికెట్ పోటీలో పలాస, బ్రాహ్మణతర్ల టీములు తెలుపబడ్డాయి. కార్యక్రమంలో ఎస్సై పారి నాయుడు, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం జీవన దానమే

- యువత స్వచ్ఛందంగా ముందుకు రావాలి
- న్యూ సెంట్రల్ స్కూల్ డైరెక్టర్ పి. శ్రీకాంత్

విశాలాంధ్ర-అరసవల్లి: స్థానిక పి.ఎన్ కాలనీలోగల న్యూ సెంట్రల్ స్కూల్ 30వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం నిర్వహించిన రక్తదాన శిబిరానికి అనూహ్య స్పందన లభించిందని, డైరెక్టర్ పి. శ్రీకాంత్ తెలిపారు. న్యూ సెంట్రల్ స్కూల్ ఆవరణలో, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సహకారంతో ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ న్యూ సెంట్రల్ స్కూల్ సిబ్బందితో పాటు శ్రేయోభిలాషులు స్వచ్ఛందంగా పాల్గొని రక్తదానం చేశారన్నారు. రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలుసుకున్న పలువురు స్వచ్ఛందంగా రక్తదానం చేసేందుకు ముందుకు రావటం హర్షణీయమని, విద్యార్థుల తల్లిదండ్రులు, నగరంలో తదితర ప్రాంతాలకు చెందిన శ్రేయోభిలాషుల సహకారంతో 101 మంది రక్తదానం చేశారని, అపోహలు వీడి యువత స్వచ్ఛందంగా ముందుకురావాలన్నారు. ఉదయం 9 గంటలకు ప్రారంభమైన రక్తదాన శిబిరం మధ్యాహ్నం 4 గంటల వరకూ కొనసాగటం విశేషం. ఈ కార్యక్రమంలో రక్త దాతలు, న్యూ సెంట్రల్ స్కూల్ డైరెక్టర్స్ పి.శ్రీకాంత్, పి.శ్రీదేవి, ప్రిన్సిపాల్ బి.మల్లేశ్వరరావు, స్కూల్ సిబ్బంది, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ పి.జగన్మోహన్ రావు, పెంకి.చైతన్య కుమార్, బి.సతీష్, తదితరులు పాల్గొన్నారు.

జీడి' మహాధర్నాను జయప్రదం చేయాలి

విశాలాంధ్ర-పలాస : కాశీబుగ్గ గాంధీ విగ్రహం వద్ద సోమవారం ఉదయం 10 గంటలకు జీడి రైతుల సంఘం, వామపక్షాల ఆధ్వర్యంలో జీడికి మద్దతు ధర ప్రకటించాలని కోరుతూ చేపడుతున్న జీడి మహాధర్నాను విజయవంతం చేయాలని జీడి రైతుల సంఘం జిల్లా కన్వీనర్ తెప్పల అజయ్‌కుమార్ కోరారు. మందస మండలం గుడ్డిభద్ర, చిన్న కేశుపురం, పెద్ద నారాయణపురం, టి గంగువాడ, అంబుగాం, లింబుగాం, పెద్ద లోహరిబంద, గొల్లలపాలెం, మందస మొగిలిపాడు, పితాలి, చిన్న పితాలి, గెద్దవూరు, జున్ను వూరు, రట్టి, బేతాళ పురం, రాంపురం తదితర గ్రామాల్లో పర్యటించి జీడి గిట్టుబాటు ధర కల్పించాలని చేపట్టనున్న మహా ధర్నాను విజయవంతం చేయాలని ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీడిపిక్కల 80 కేజీలు బస్తాకు రూ.16 వేలు మద్దతు ధర ప్రకటించి, ఆర్బికెల ద్వారా ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. వైసిపి ప్రభుత్వం ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఢిల్లీ రైతు ఉద్యమ స్ఫూర్తితో పలాస కాశీబుగ్గ పట్టణంలో జరుగుతున్న ఈ మహాధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు టి భాస్కరరావు, కొర్ల హేమారావు చౌదరి, ఎం రామారావు, జి బాలకృష్ణ, కీలు తవిటయ్య, హడ్డీ మాస్టర్, మజ్జి బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

అనాథ చిన్నారులను ఆదుకున్న భగత్‌సింగ్ ట్రస్ట్



విశాలాంధ్ర-కొత్తూరు : తల్లి ఒక నెలరోజుల క్రితం చనిపోయింది, తండ్రి రెండేళ్ల క్రితం చనిపోయారు. ఇక నా అనేవాళ్లు ఎవరూ లేక అనాథలైన ఆ చిన్నారులను భగత్‌సింగ్ ట్రస్ట్ చేయూతనిచ్చింది. వివరాల్లోకి వెళ్తే కొత్తూరు మండలం సిరుసువాడ గ్రామానికి చెందిన భార్యాభర్తలు పాత్రో హేమసుందర్, జాబిల్లికి హిమప్రియ(8), చాందినీ(6) ఇద్దరు ఆడపిల్లలు. ఈకుటుంబానికి ఎలాంటి ఆస్తులు లేవు. నిరుపేద కుటుంబంకాగా పాత్రో హేమాసుందర్ కొన్నేళ్ళ క్రితం అనారోగ్య కారణాలతో మృతిచెందారు. తల్లి జాబిల్లి స్థానిక పాఠశాలలో అయాగా పనిచేస్తూ ఇద్దరు ఆడపిల్లలను పోషించేది. ఆమె కూడా ఒక నెలరోజుల క్రితం మృతిచెందగా కుమార్తెలు ఇద్దరూ అనాథలైనారు. తల్లిదండ్రులను కోల్పోయిన హిమప్రియ, చాందినీల విషయాన్ని కొత్తూరు కేంద్రంగా సేవలందిస్తున్న భగత్‌సింగ్ ట్రస్ట్ నిర్వాహకులకు తెలియపరచడంతో ఆదివారం సిరుసువాడ అనాథ చిన్నారుల ఇంటికి వెళ్లి ఆగ్రామ పెద్దలతో మాట్లాడి ఇక నుండి ఈ చిన్నారులకు నెలనెలా వెయ్యి రూపాయిలు పెన్షన్‌ను తమ ట్రస్ట్ తరుపున ఆర్థిక సాయాన్ని అందిస్తామని భగత్‌సింగ్ ట్రస్ట్ ప్రకటించింది. ప్రభుత్వం కూడా ఈ అనాథలైన హిమాప్రియ, చాందినీలను ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

శ్రీ సూర్యనారాయణ దేవస్థానంలో 108 సామూహిక సూర్యనమస్కారాలు

విశాలాంధ్ర-అరసవల్లి: మారుతీ వాకర్స్ క్లబ్, కొంక్యాన గోవిందరాజులు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం షిరిడి సాయి యోగా సెంటర్ సహకారంతో సామూహిక సూర్యనమస్కారాల కార్యక్రమం ప్రత్యక్ష దైవం అరసవల్లి శ్రీ సూర్యనారాయణ స్వామి దేవాలయంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డిప్యూటీ కలెక్టర్ ఎం లావణ్య, ఏపిఎన్‌జివో అధ్యక్షుడు శివారెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చౌదరి పురుషోత్తం నాయుడు విశిష్ట అతిదులుగా పాల్గొని సూర్యనమస్కారాలను తిలకించి అభినందించారు. ఇటువంటి కార్యక్రమాలను చేయడం చాలా ఆనందంగా ఉందని, ఈ కార్యక్రమంలో భాగస్వామ్యులు కావటం మా అదృష్టమన్నారు. మాఘ మాసం అమావాస్యతో కూడిన ఆదివారం కావడంతో సామూహిక సూర్యనమస్కరాల కార్యక్రమాన్ని 100 మంది మహిళలతో నిర్వహించినట్లు మారుతి వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు కొంక్యాన మురళీధర్ తెలిపారు. యోగా గురువు రామారావు పర్యవేక్షణలో జరిగింది.

అబాకస్ రాష్ట్ర స్థాయి పోటీల్లో యూనివర్సల్ బహుమతి

విశాలాంధ్ర-మెళియాపుట్టి: అబాకస్ రాష్ట్రస్థాయి పోటీల్లో యూనివర్సియల్ పాఠశాల విద్యార్థులు తృతీయ బహుమతి పొందినట్టు ప్రధానోపాధ్యాయుడు కలమట శేఖర్ తెలిపారు. ఆదివారం మండలంలోగల చాపర గ్రామంలో యూనివర్సియల్ పాఠశాల నుండి ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన ఇటీవల ఫిబ్రవరి 18వ తేదీన నరసన్నపేటలో విశ్వం ల్యాబ్ మాథెమాటిక్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి పోటీల్లో విజయం సాధించి అనంతరం విజయవాడలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొని సీనియర్ విభాగం నుంచి ఆరవ తరగతికి చెందిన డి. శృతి విజయం సాధించారన్నారు. ఈ ప్రకటనలో ఆయనతో పాటు విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులున్నారు.